
## సిపిఎం మహాసభలను విజయవంతం చేయాలి

**ఘట్‌కేసర్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** ఈనెల 7న జరిగే సిపిఎం మేడ్చల్ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని సీనియర్ నాయకులు చింతల యాదయ్య పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి ఎన్.సబిత ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. చింతల యాదయ్య, సబితలతో పాటు నాయకులు పాల్గొని పోస్టర్‌ను విడుదలచేసి నినాదాలు చేశారు. డిసెంబర్ 7,8ల్లో నిజాంపేట్ ప్రగతినగర్‌లో జరుగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ప్రతినిధులసభలో మూడు సంవత్సరాలుగా నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తులో ప్రజలు ఎదుర్కొంటున్న విద్య,వైద్య,ఉద్యోగం,ఉపాధి అవకాశాలను కల్పించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయాలని ప్రారంభసభకు ముఖ్యఅతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకురాలు బి.సునీత,శ్రీకాంత్‌గౌడ్,బూడిదస్వామి,దశరథ,మంచాల మల్లేశ్, చిక్కుడు మల్లేశ పాల్గొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## కీసరగుట్టలో స్వామివారి ఆదాయం లెక్కింపు

**కీసర, డిసెంబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీరామలిం గేశ్వరస్వామి ఆలయ కార్తీకమాసోత్సవాల హుండీని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ ఆధ్వర్యం లో మంగళవారం లెక్కించారు. చైర్మన్ మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రసాదాలు, అభిషేకములు, దర్శ నం టికెట్లు కలుపుకుని 1 కోటి 1 లక్ష 81 వేల 543 రూపాయలు వచ్చాయన్నారు. కేవలం ఒక్క హుండీకే 30 లక్షల 52 వేల 236 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సారి 29 లక్షల రూపాయల ఆదాయం అధికంగా వచ్చిందన్నారు. ఈ ఆదాయం రికార్డు స్థాయిలో అధికంగా వచ్చిందన్నారు. ఈ సంవత్సరం భక్తులు అభిషేకములందు అధికసంఖ్యలో పాల్గొన్నార న్నారు. ప్రభుత్వం చేపట్టిన మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణంలో భాగంగా అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ శేఖర్, ఈఓ కట్ట సుధాకర్‌రెడ్డి, నరసింహ్మా సేవాసమితి, అన్నపూర్ణ సేవాసమితి, శ్రీవారి సేవ బృందం, దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం



ఆర్కతలలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న నల్లగొండ అదనపు ఎస్పీ రాములునాయక్



మాట్లాడుతున్న నల్లగొండ అదనపు ఎస్పీ రాములునాయక్

**నవాబుపేట, డిసెంబరు 3, ప్రభాతవార్త:**

### వార్తకు స్పందన

ఖనిజ సంపద ఎర్రమట్టిని ఇష్టారాజ్యంగా కొల్లగొడుతున్న నేపథ్యంలో నవంబర్ 15 వార్త దినపత్రికలో ప్రచురితమైన కథనం అక్రమ మట్టి తవ్వకాలు నిఘావైఫల్యం అధికారుల నిర్లక్ష్యం అనే శీర్శికతో ప్రచురితమైన తరుణంలో ఐజిపి సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డిలు తీవ్రంగా స్పదించారు. ఈ నేపథ్యంలో విచారణకు ఆదేశించారు. మంగళవారం నల్లగొండ అదనపు ఎస్పీ రాములునాయక్, మిరియాలగూడ సిఐ నాగార్జున తదితర పోలీసు బృందం ఆధ్వర్యంలో అక్రమమట్టి తవ్వకాలు జరుపుతున్న ఆర్కతల, మీనపల్లికలాన్, చిట్టిగిద్ద గ్రామాల్లో క్షేత్రస్థాయి విచారణ చేశారు. సంబంధిత గ్రామ మాజీ సర్పంచ్‌లను కార్యదర్శులను, బాధితులను, స్థానికప్రజలను కొందరిని, కథనాన్ని వ్రాసిన విలేకరి విచారణ చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో విలేకరులతో మాట్లాడారు. అక్రమ మట్టి తవ్వకాల విషయంలో అన్నికోణాల్లో లోతైన దర్యాప్తు కొనసాగుతున్నదని చెప్పారు. ఈ విచారణలో సంబంధిత శాఖల వారీగా విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. సహజ సంపదను సమష్టి సహకారంతో కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు. అక్రమంగా ఖనిజసంపదను కొల్లగొడితే కఠినమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమంగా సాగుతున్న ఖనిజసంపద మట్టి తవ్వకాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఆయన చెప్పారు. వార్త కథనానికి ముందుగా స్థానిక పోలీసులు స్పందించి పటిష్ఠమైన నిఘా ఏర్పాటుచేసి అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను కూడా అదుపులోకి తీసుకోవటాన్ని ఆయన పరోక్షంగా అభినందించారు. ఇక మీదట కూడా ఇదే స్ఫూర్తి కొనసాగించాలని ఆయన సూచించారు. సహజసంపదకు ఎక్కడ విఘాతం కలిగించినా ఉపేక్షించకుండా బాధ్యతగల వారందరూ స్వచ్ఛందంగా స్పందించాలని ఆయన హితవు చెప్పారు. బంగారం లాంటి సారవంతమైన మట్టి చెరువుల నుండి కూడా అక్రమంగా తరలించే విషయంలో కూడా లోతైన విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. విచారణలో దోషులు తేలితే, చట్టపరమైన చర్యలు తప్పవని, సంబంధిత శాఖల అధికారులు కూడా విధిగా అక్రమమైనింగ్‌పై నిఘా పెంచాలని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో స్థానికేతర పోలీసు అధిరారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అడిషనల్ డిసిపి ఆకస్మిక తనిఖీ



ఫోటోరైటప్.ఏజిఎల్5. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్

**ఆమనగల్లు, డిసెంబరు 3, ప్రభాతవార్త:** శంషాబాద్ అడిషనల్ డిసిపి రామ్‌కుమార్ మంగళవారం ఆమనగల్లు పోలీస్‌స్టేషను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆమనగల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్, ఎస్సై బి.వెంకటేశ్‌లు అడిషనల్ డిసిపికి పూర్తి వివరాలను వివరించారు. అలాగే కేసుల నమోదు, వాటి పరిష్కారం, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా గమనించారు.

## లగచర్ల నిందితులకు బెయిల్ నిరాకరణ..

**-ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని సూచించిన వికారాబాద్ కోర్టు**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనలోని నిందితులకు సంబంధించిన బెయిల్ పిటిషన్‌ను మంగళవారం వికారాబాద్ జిల్లా కోర్టు నిరాకరించింది. లగచర్ల ఘటనలోని నిందితులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ, బిఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు నవంబర్ 14వ తేదీన వికారాబాద్ జిల్లా కోర్టులో 5 పిటిషన్లు దాఖలు చేశారు. ఈ విషయమై 4 సార్లు వాదనలు సైతం బిఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు వినిపించినట్లు తెలిపారు. మంగళవారం బెయిల్ పిటిషన్‌పై వికారాబాద్ జిల్లా కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండగా, బెయిల్ నిరాకరించారని బిఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన అంశము అయినందున తమ పరిధిలోకి రాదని, తాము బెయిల్ ఇవ్వలేమని వికారాబాద్ కోర్టు స్పష్టం చేసింది. ఈ విషయమై ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని బెయిల్ పిటిషన్ దారులకు వికారాబాద్ కోర్టు సూచించినట్లు బిఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు తెలిపారు.

## పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్, డిసెంబరు 03, ప్రభాతవార్త:**

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో నిర్మించిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రారంభం చేయనున్న క్రమంలో జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో జనరల్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ గదులను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణతో పాటు గదులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం అనంతగిరిగుట్టలో నిర్మించిన సమీకృత ఆయుష్ వైద్యశాలను పరిశీలించారు. వైద్యశాల ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలను సమర్పించాలని టీఎస్ జిఎంఐడిసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ ను ఆదేశించారు. ఆయన వెంట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంచందర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, డిఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

## హోంగార్డును సన్మానించిన జిల్లా ఎస్పీ

**వికారాబాద్, డిసెంబర్ 03, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ కార్యాలయంలో కమ్యూనికేషన్ విభాగంలో దీర్ఘకాలంగా సేవలందించి పదవీ విరమణ పొందిన హోంగార్డ్ అధికారి జి.సత్తయ్య జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పదవీ విరమణ పొందిన హోంగార్డ్స్ అధికారులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, ఏదైనా అవసరం వస్తే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. హోంగార్డ్స్ అధికారులు పోలీస్ శాఖకు చేసే సేవలు ఎంతో విలువైనవని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ డేవిడ్, జిల్లా హోంగార్డ్స్ ప్రసిడెంట్ సుధాకర్, తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ చాంద్ పాషా, జిల్లా లోని హోంగార్డ్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏటిఎం లూటీకి యత్నించిన దొంగలు



ఏటీఎంలో లూటీకి యత్నించిన దొంగల సిసి ఫుటేజీ

**తాండూరు, డిసెంబరు 3, ప్రభాతవార్త:**

ముఖానికి మాస్కులు ధరించిన గుర్తు తెలియని దొంగలు ఏటీఎంలో లూటీకి యత్నించారు. కరెంటు కనెక్షన్ కట్ చేసీ చోరీకి యత్నించగా వెంటనే అలారం మోగడంతో నిందితులు అక్కడి నుండి పారిపోయారు. ఈ సంఘటనకు సంబందించి అక్కడే ఉన్న సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యింది. కరణ్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరణ్‌కోట్ గ్రామంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్కులు ధరించి దొంగతనానికి యత్నించారు. కరెంట్ ఎటీఎంకు సంబందించి కరెంటు కనెక్షన్ కట్‌చేసి లోనికి ప్రవేశించిన దొంగలు ఏటీఎంను పగలగొట్టేందుకు ప్రయత్నించగా వెంటనే అలారం మోగింది. దీంతో బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే కరణ్‌కోట్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లే సరికి దొంగలు పారిపోయారు. ఏటీఎం నుండి ఎలాంటి డబ్బులు చోరీ జరగలేదని పోలీసులు తెలిపారు. అయితే, చోరీకి యత్నించిన సంఘటనకు సంబందించి సీసీ కెమెరాలు రికార్డు అయ్యిందని వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దొంగలకు సంబందించి ఆచూకి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 4, ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంచాల మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగంపల్లి గేట్ సమీపంలో చోటుచేసుకుంది. సిఐ మధు తెలిపిన కథనం ప్రకారం.. నారాయణపూర్ మండలం కడిలబాయి తండా గ్రామానికి చెందిన మహేష్ (23) తన ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నం నుండి మంచాల మీదుగా గ్రామానికి వెళ్తున్నాడు. లింగంపల్లి గేట్ సమీపంలో రాగానే ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీ కొట్టింది. మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**



2కె రన్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** చదువుతో పాటు ఆరోగ్యం చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలలో భాగంగా మున్సిపల్ పరిదిలోని ఎన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు 2కె రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా అధికారులు, విద్యార్థులు, యువకులతో కలిసి 2కె రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విజయోత్సవాల కార్యక్రమాలను తొమ్మిది రోజులపాటు శాఖలవారీగా నిర్వహించడం జరుగుతుందని, ఆయా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు. ప్రతిరోజు 24గంటల సమయంలో, ఉదయం గంటపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ఒకగంట పాటు ఆరోగ్యసూత్రాలు పాటించాలని సూచించారు. చిన్నతనం నుండే ఆరోగ్య సూత్రాలను పాటిస్తే వయసు పెరిగిన కొద్దీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యసూత్రాలను పాటిస్తూ వ్యాయామం చేయాలని సూచించారు. 2కె రన్ విజయవంతం చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మంజుల రమేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల ప్రజాపాలనపై ముఖ్య ఉద్దేశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్, డివైఎస్ఓ హనుమంతరావు రావు, డిటిడిఓ కమలాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహమ్మద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, బిసి, మైనార్టీ, ఎస్టీ హాస్టల్స్ విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ కళాశాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టాలి

**-కలెక్టర్ ప్రతీక్ జైన్**



నర్సింగ్ కళాశాల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడుతున్న కలెక్టర్

**కొడంగల్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలో నర్సింగ్ కళాశాల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు.మంగళవారం పట్టణంలోని సమీకృత బాలికల వసతిగృహ సముదాయంలో తాత్కాలికంగా నిర్వహించే నర్సింగ్ కళాశాల భవనాన్ని క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యవేక్షించి పరిశీలించారు. భవనానికి సంబంధించి అన్ని మౌలిక సదుపాయాలతో పాటు కావాల్సిన మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పట్టణంలోని మార్కెట్ కమిటీ సమీపంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులకు అల్పాహారం సిద్ధంచేసి అందించే వంటశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల్లోని 312 పాఠశాలల్లో 27వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

# ప్రజల కోరిక మేరకే అభివృద్ధి పనులు

**రాష్ట్ర ప్రభుత్వ ఛీప్ విప్ మహేందర్‌రెడ్డి**

**ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి మేడ్చల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



మేడ్చల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన ప్రభుత్వ ఛీప్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, డిసెంబరు 3. ప్రభాతవార్త:** ప్రజల కనీస అవసరాలను తీర్చేందుకు గాను ప్రజల కోరిన విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రభుత్వ ఛీప్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలో రూ. 2.43 కోట్లతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి మంగళవారం ప్రభుత్వ విప్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ తక్కువ సమయంలో రాష్ట్రంలో అన్నివిధాల అభివృద్ధి పనులను చేపడుతున్నారని, పేదప్రజలకు సంక్షేమపథకాలను అందిస్తున్నారని చెప్పారు. ఇచ్చినమాట ప్రకారం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఇంటింటికి ఉచిత కరెంట్ అందివ్వడంతో పాటు రూ. 500లకే గ్యాస్‌ను ఇస్తున్నామని అన్నారు. ముందు ముందు మున్సిపాలిటీల్లో, మండలాల్లో నిధులు ఇచ్చి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. పెద్ద నియోజకవర్గమైన మేడ్చల్‌కు నిధుల అవసరమున్నదని, ఇక్కడి అభివృద్ధి కొరకు సిఎం దృష్టికి తీసుకెళ్లి తగిన నిధులు మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దీపికానర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేష్, బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రెండుగంటలు వేచి ఉన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి...**

మేడ్చల్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల భూమిపూజ కోసం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పట్టణంలో సుమారు రెండుగంటలు పాటు వేచి ఉన్నారు. ఒకప్పుడు మంత్రి ఉన్న సమయంలో మల్లారెడ్డి అభివృద్ధిపనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సమయానికి వచ్చి వెళ్లే వారు. ఆయనరాక కోసం స్థానిక నాయకులు గంట ముందు నుంచే ఎదురు చూసే వారు. కాని నేడు ఎమ్మెల్యే పదవిలో ఉన్న మల్లారెడ్డే శంకుస్థాపనల కోసం అనుకున్న సమయానికి మేడ్చల్‌కు వచ్చి తన కార్యాలయంలో రెండుగంటల పాటు వేచి ఉండటంతో స్థానికంగా హట్ టాపిక్‌గా మారింది. అయన అధికార పార్టీలో లేకపోవడమే అందుకు కారణమని, గతంలో మున్సిపల్ చైర్మన్ స్వంతపార్టీలో ఉండటంతో అనుకున్న విధంగా వచ్చి వెళ్లే వారని, నేడు మున్సిపల్ చైర్మన్ అధికారపార్టీలో ఉండటంతో ఎమ్మెల్యేకే వేచి ఉండాల్సిన అవసరం వచ్చిందని మాట్లాడుకోవడం శోచనీయం.

ఎమ్మెల్యే మల్లారెడ్డికి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మధ్య పడకపోవడమే ఇందుకు కారణమని, సమయానికి ఎమ్మెల్యే మేడ్చల్‌కు విచ్చేసినా అదే సమయంలో ప్రజాపాలన కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని ఎమ్మెల్యే మల్లారెడ్డిని కావాలనే వేచి ఉంచే విధంగా చేశారనే చర్చలు కొనసాగాయి. ఏది ఏమైనా మల్లారెడ్డి వేచి ఉండటం మేడ్చల్‌లో మంగళవారం చర్చనీయాశంగా మారింది.

## ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

ధారూరు, డిసెంబరు 3, ప్రభాతవార్త: ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కుమ్మరిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన సాయమ్మ(45) హోటల్లో కూలీపని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తమ్ముడైన ఆనంద్ అదేగ్రామానికి చెందిన కావలి వెంకటయ్య కూతురు వివాహం కోసం తీసుకెళ్లాడు. ఆక్రమంలో వికారాబాద్ పోలీసులు, అవుసుపల్లి గ్రామానికి చెందిన లెండర్ వెంకటయ్య, నాగమణి తదితరులు ఫోన్‌చేసి మీతమ్ముడు ఎక్కడున్నాడని పదేపదే అడుగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తమ్ముడైన అశోక్‌కు సోమవారం రాత్రి ఫోన్లో సమాచారం ఇచ్చింది. అదేరోజు సాయంత్రం సమయంలో ముగ్గురు కుమ్మర్‌పల్లి గ్రామానికి వచ్చి తన తల్లి అయిన చంద్రమ్మను బెదిరించి, నానా బూతులు తిట్టారు. దీంతో మనస్తాపానికి గురైన సాయమ్మ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

**షాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త** :షాబాద్ మండలం సాయిరెడ్డిగూడ గ్రామంలో పునర్నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయానికి బీజేపీ సీనియర్ నాయకుడు పొన్న రాజీవ్‌రెడ్డి రూ.50వేల విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం సంతోషంగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు.

## డంపింగ్ ఏర్పాటుపై గ్రామస్తుల ఆందోళన



పరిగిలో ఆందోళన కారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**పరిగిరూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** పరిగి మండల పరిధిలోని నజీరాబాద్ తండ, మాదారం, రంగాపూర్ శివారులోని డంపింగ్ యార్డ్ నిర్మాణం విషయం లో ఘర్షణ తలెత్తింది. చుట్టుపక్కల గ్రామస్తులు మాకు డంపింగ్ యార్డ్ వద్దని ఆందోళనకు దిగారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి డంపింగ్ యార్డ్ శంకుస్థాపనకు మంగళవారం వచ్చారు. అదే సమయంలో డంపింగ్ యార్డ్ వల్ల మా పొలాలు నాశనం అవుతాయని రైతులు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

## విద్యాసేవలకు గుర్తింపుగా రవికుమార్‌కు డాక్టరేట్

**ఘట్‌కేసర్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** విద్యారంగంలో అందిస్తున్న సేవలకు గాను ఘట్‌కేసర్‌కు చెందిన వేల్పుల రవికుమార్‌యాదవ్‌కు స్టాన్‌ఫోర్డ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌లోని మినార్వా గ్రామర్ హైస్కూల్ డైరక్టర్ రవికుమార్‌యాదవ్ లెమెన్‌ట్రీ, శాండిల్‌సూట్స్ నోయిడా సెక్టార్ 135, న్యూఢిల్లీలో జరిగిన న్యూఢిల్లీ కాన్వాకేషన్ స్టాన్‌ఫోర్డ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ద్వారా ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ అందుకున్నారు. గత 25 సంవత్సరాలుగా నిరుపేద విద్యార్థుకు ఉచితవిద్య, అనాథ, సింగిల్ పెరెంట్ విద్యార్థికి 50 శాతం రాయితీ అందిస్తూ విద్యావ్యాప్తికి రవికుమార్ చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి యూనివర్సిటీ డాక్టరేట్‌తో గౌరవించింది. పేదవిద్యార్థులను చదువులో ప్రోత్సహించి వారికి తోడ్పాటును అందించడంలో ఆయన అందించిన సేవలు ప్రశంసనీయమని వర్సిటీ అధికారులు పేర్కొన్నారు. మినార్వా స్కూల్ డైరక్టర్ రవికుమార్‌కు డాక్టరేట్ రావడం పట్ల ప్రిన్సిపాల్ వేల్పుల అనురాధ, టీచర్లు హర్షం వ్యక్తం చేశారు

## అట్టహాసంగా సాయిబాబా ఆలయ ప్రారంభోత్సవం

**మేడ్చల్, డిసెంబరు 3. ప్రభాతవార్త** : మేడ్చల్ మండలంలోని పూడూర్‌లో నూతనంగా నిర్మించిన సాయిబాబ ఆలయ నిర్మాణ వారోత్సవాలు ఈ నెల 5 నుండి 7 వ తేదీ వరకు జరుగనున్నట్లు ఆలయ చైర్మన్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మొదటి రోజు గురువారం విగ్రహల ఊరేగింపు, రెండో రోజు ప్రత్యేక హోమాలు, మూడో రోజు శనివారం ఉదయం 8.45 గంటలకు విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నాడు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలతో పాటు మండల పజలు విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరాడు.


## గుండ్లపోచంపల్లిలో ప్రజాపాలన వారోత్సవాలు



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ సిబ్బందిని సన్మానించిన మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

**మేడ్చల్, డిసెంబరు 3. ప్రభాతవార్త** : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ప్రజా పాలన వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయంలో డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ 1.37 కోటి నిధుల మంజూరి చెక్కులను మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. అనంతరం మున్సిపల్ మహిళా సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ ఆటలు, కోలాటం ఆడి ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వామి, వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సంచ్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు

## కలెక్టరేట్ వద్ద ధర్నా విజయవంతం చేయండి



డాక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అల్లి దేవేందర్

**షాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త** :ఆశా కార్యకర్తల సమస్యలపై నేడు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం చేవెళ్ల మండల పరిధిలోని చందన్‌వెల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌కు ఆశా సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఆశా కార్యకర్తలకు సర్వే చేసిన లెప్రోసి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. లెప్రోసి సర్వేతో ఆశాలు ఇబ్బందులుపడుతున్నారని, వెంటనే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఆశా సమస్యలపై నేడు తలపెట్టిన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ధర్నాకు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆశా కార్యకర్తలు ఉన్నారు.

# ప్రజా సేవలో మహిళాపోలీసులు

22 ఎళ్ల తరువాత కలుసుకున్న స్నేహితురాళ్లు
-కుటుంబాలతో రోజంతా గడిపిన మహిళ పోలీసు అధికారులు
-శంకర్‌పల్లి మండల మోకిల ఎఎస్ఐ పద్మ చోరవతో సాధ్యం




ఉస్తావ్ ఫాంహౌజ్‌లో మహిళ పోలీసుల ఆత్మీయ సమ్మేళనం

**చేవెళ్ళ, డిసెంబరు 3, ప్రభాతవార్త** : ప్రజా సేవలో నిత్యం మహిళ పోలీసులు తీరిక లేకుండా గడిపిన పోలీసులు 22 ఎళ్ల తరువాత కలసి అనందంతో కుటుంబాలు గడిపిన సంఘటన శంకర్‌పల్లి మండలం జన్వాడలోని కెవిఎన్ ఉస్తావ్ ఫాంహౌజ్‌లో జరిగింది. అరుదైన సంఘటన శంకర్‌పల్లి మండల మోకిల ఎఎస్ఐ పద్మ చోరవతో 22ఎళ్ల క్రితం అనంతపూర్ ట్రైనింగ్ సెంటర్‌లో పరిచయమైన మహిళ పోలీసులు ప్రస్తుతం కలుసుకోవడం విశేషం.అప్పుడు సింగల్‌గా ఉండి పరిచయమైన మహిళ పోలీసులు భర్త, పిల్లలతో కలువడం మరో విశేషం. 2202 బ్యాచ్‌కు చేందిన మహాళా పోలీసు అధికారులు 22సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళ పోలీసుల స్నేహితురాళ్లతో ఆత్మీయ సమ్మేళన ఘనంగా జరుపు కున్నారు. నిత్యం జనం కోసం బిజీ బిజీగా గడుపుతున్న మహిళ పోలీసులు కుటుంబంతో,స్నేహితురాళ్లతో అనందంగా గడుపడం తీపి గుర్తుగా మారింది. ఉమ్మడి ఎపి,తెలంగాణలో వివిధ పోలీస్ స్టేషన్‌లల్లో విధులు నిర్వహిస్తున్న మహిళ పోలీసు అధికారులు ట్రైనింగ్‌లలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుంటు గడిపారు. పోలీసు విధుల్లోకి వెళ్లాలంటే భయపడుతున్న రోజుల్లో ఎంతో ధైర్యంతో పోలీసు ఉద్యోగంలో చేరి సమాజం కోసం శ్రమిస్తూ మరొకరి ఆదర్శంగా నిలిచారు.గతంలో పోలీసు ఉద్యోగంలో చెరిన మహిళల సంఖ్యవేళ్ల మిద లెక్కపెట్టవచ్చు కాని ప్రస్తుతం పోలీస్ శాఖలో చెరిన మహిళలు వెలల్లోనే ఉన్నారు.గత 22 సంవత్సరాలక్రితం పోలీస్ శాఖలో అతి పిన్నవయస్సులో ఉద్యోగంలో చేరి ప్రజా సేవలో భాగస్వాములు అయ్యారు.నిక్కచ్చిగా విధులు నిర్వహిస్తు సమాజానికి 2002 బ్యాచ్‌కు చేందిన మహిళ పోలీసులు ప్రజల మన్ననలు పోందుతున్నారు. పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరి ఇటు కుటుంబంను అటు పోలీసు ఉద్యోగంను సమపాలల్లో నిర్వహిస్తు సమాజానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

# ప్రజామోద పాలనను అందించండి

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న జర్నలిస్టులు

**షాద్‌నగర్, డిసెంబరు 03 (ప్రభాతవార్త)** : సామాజికసేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ప్రజా మోదపాలన అందించాలని షాద్‌నగర్ జర్నలిస్టులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఖాజాపాష (కేపీ) ఆధ్వర్యంలో స్థానిక జర్నలిస్టులు ఎమ్మెల్యేకుపుష్పగుచ్చాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. షాద్‌నగర్ ప్రాంతంలో ఎంతో కాలంగా ధీనావస్థలో ఉన్న ప్రభుత్వ కళాశాల భవనం స్థానంలో అన్ని హంగులతో నూతనభవననిర్మాణం చేపట్ట తలపెట్టిన ఆయన ఆశయంగొప్పదని, పేద విద్యార్థుల కోసం ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని జర్నలిస్టులు ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా విద్యతో పాటు వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండివారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు ఎప్పుడు ప్రజల పక్షమేనని, ప్రజా వ్యతిరేఖ కార్యక్రమాలు ఎక్కడ జరిగినాఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఎవరు ప్రవర్తించినా ధైర్యంగా పాత్రికేయులు వాటిని బయటపెట్టాలని కోరారు. ప్రభుత్వం మీద విమర్శలు వస్తే వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తామని, స్వచ్ఛమైన పాలన అందించడమే లక్ష్యంగా ముందుకు పోతామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో సీనియర్ జర్నలిస్టులు కస్తూరి రంగనాథ్, టంగుటూరి సంజయ్ కుమార్, శ్రీశైలం, రాఘవేందర్ గౌడ్, సరాపు రమేష్, జర్నలిస్టులుమల్లికార్జున్, ప్రవీణ్, గిరి, సమీ, శేఖర్, తదితరులు ఉన్నారు.

# ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన



శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఆర్టిపిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం 'కోడ్ యువర్ ఫ్యూచర్' అనే అంశంపై 3 రోజులపాటు హ్యాండ్‌ఆన్‌సెషన్ నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రారంభమైన శిక్షణలో సెషన్‌డీన్ ఎస్ఓఈ డాక్టర్ వి.విజయ్‌కుమార్ హజరై ప్రసంగించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్య, రెజ్యూమె నిర్మాణంలో వాటి అవశ్యకతపై విభాగాధిపతి డాక్టర్ ఎ.మల్లికార్జున్‌రెడ్డి అవగాహన కలి ్పంచారు. డెకాయిట్‌కు చెందిన ఎక్స్‌పర్ట్‌స్పీకర్ వైలూరు పెరుమాళ్లు విద్యార్థులను జనరేటివ్ ఏఐలోకి తీసుకెళ్లారు. కృత్రిమమేధలో పరిశ్రమ అంతర్దృష్టులు, ఆచరణాత్మక నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడం, పైథాన్, ఎపిఐ అభివృద్ధి, లాంగ్ చైన్, జెమినీ వంటి ఫ్రేమ్ వర్క్‌లపై దృష్టి సారించడం, హగ్గింగ్‌ఫేస్, ఓపెన్ ఏఐ మోడల్స్, ఆర్ఎజీ, ప్రాంప్ట్ ఇంజనీరింగ్ వ్యూహాలు వంటి సాధనాలను అన్వేషించడం ఈషెషన్ లక్ష్యమని తెలిపరాఉ. ముగింపులో వర్క్‌షాప్ ఏఐలో ప్రస్తుత ధోరణలు, అవసరమైన సాధనాలపై విలువైన జ్ఞానాన్ని అందించడం ద్వారా టెక్ పరిశ్రమలో విజయవంతమైన కెరీర్ కోసం పాల్గొనే వారిని సిద్ధం చేస్తుందని తెలిపారు. ఏఐ విభాగం ఆధ్వర్యంలో ఎనిగ్మాక్లబ్ నిర్వహిస్తున్న ఈకార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ శిల్పాశేష ం, క్లబ్‌స్టూడెంట్ కోఆర్డినేటర్లు చురుకుగా పాల్గొన్నారు. 120 మంది విద్యార్థులు ఈషెషన్‌కు హజరై ఏఐ టూల్స్‌పై అవగాహన పొందారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డు లేవీ?

బిజెపి మండల అధ్యక్షులు కిరణ్



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**షాబాద్, డిసెంబరు3, ప్రభాతవార్త** : తమది ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక నిరుపేద కుటుంబానికి సైతం తెల్ల రేషన్ కార్డు పంపిణీ చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి కారణమని బీజేపీ మండల అధ్యక్షులు కిరణ్ అన్నారు. అర్హులకు రేషన్‌కార్డుల చేయకపోవడంపై నిరసనగా బీజేపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి మంగళవారం షాబాద్ చౌరస్తా నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి డిప్యూటీ తహసీల్దార్ మధుకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న ఇప్పటి వరకు ఒక నిరుపేద కుటుంబానికి సైతం రేషన్ కార్డు పంపిణీ చేయలేదన్నారు. 6గ్యారంటిలు అమలు చేశామని చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడుతూ పోతున్నారని విమర్శించారు. ఈకార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, రాము, మాణెయ్య, కూతురు మహేందర్, సతీష్‌రెడ్డి, పొన్న రాజీవ్‌రెడ్డి, లింగాల మహేందర్, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

## మృతుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సోషలిస్ట్ పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుముదిరాజ్

**షాబాద్, డిసెంబర్ 3, ప్రభాతవార్త** :ఆలూర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని సోషలిస్ట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు వినతి పత్రాన్ని చేవెళ్ల ఆర్డీవోకు వారు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....నిరుపేద కుటుంబాలకు చెందిన రైతు కుటుంబ సభ్యులు రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకుంటున్న వారిపై లారీ దూసుకు వెళ్లి ప్రాణాలు తీయడం చాలా బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయి ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు, గాయపడిన వారికి రూ.10లక్షలు చెల్లించి ఆదుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సోషలిస్ట్ పార్టీ నాయకులు సుప్పల నర్సింలు, గూడూరు జంగయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

## మేడ్చల్‌లో ప్రజా వారోత్సవాల ర్యాలీ




మేడ్చల్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**మేడ్చల్, డిసెంబర్ 3. ప్రభాతవార్త** : రాష్ట్రంలో ప్రజా పాలన ఏర్పడిన సంవత్సరంలోనె అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన వారోత్సవాల్లో భాగంగా మేడ్చల్ మున్సిపాలిటీలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం ంవంత్‌రెడ్డి ప్రజా పాలన కొనసాగిస్తున్నారని, సంవత్సర కాలంలో పేద ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. మరో పక్క అన్ని రంగాల్లో అభివృద్ధి చేపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ దీపిక నర్సింహరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు దేవ, కొడె మహేష్, సరస్వతి, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి యాదవ్, చాప రాజు, వివిద పార్టీల నాయకులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు వేయించాలి



గొర్రెలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

**షాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త** :పశువులకు, జీవాలకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందుగా టీకాలు ఇప్పించాలని షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి అన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంతో పాటు కేసారం గ్రామంలో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈసందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ.... జీవాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి వ్యాధుల నుంచి రక్షించుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామాల్లో పారుడు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది, రైతులు ఉన్నారు.

## శ్రీకాంతచారి బలిదానాన్ని తెలంగాణ మరువదు

మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎం.ఎస్.నటరాజన్



శ్రీకాంతచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**షాద్‌నగర్, డిసెంబరు 03 (ప్రభాతవార్త)** : శ్రీకాంత చారి ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిందని బీఆర్ఎస్ పట్టణ పార్టీఅధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.ఎస్.నటరాజన్ అన్నారు. మంగళవారం శ్రీకాంతచారి వర్థంతి సందర్భంగా బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నటరాజన్ మాట్లాడుతూ శ్రీకాంతచారి బలిదానాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరని, తెలంగాణ ఉద్యమకారులపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దమనకాండ, కేసీఆర్ అరెస్టును చూసి తట్టుకోలేక శ్రీకాంతచారి ప్రాణత్యాగం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, గుండు అశోక్, శరత్ కృష్ణ, సందీప్ సింగ్, శీలం శ్రీకాంత్, తమకొండ రాజశేఖర్, హన్మంతు, నార్ల శ్రీనివాస్, సత్యం ముదిరాజ్, శేఖర్, సంజు నాయక్, ప్రవీణ్, శివ, నవీన్, తేజు యాదవ్, సాయి తేజ, శివ నాయక్, జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం



బాధితున్ని పరమార్శిస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

**దోమ,డిసెంబరు 3 ప్రభాతవార్త** : బిఆర్ఎస్‌పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని పర్గిమాజి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు.దోమ మండల పరిదిలోని ఉదన్‌రావుపల్లి గ్రామానికిచెందిన మైనోద్దీన్ అనారోగ్యం చెందడముతో మంగళవారం నాడు ఆయన ఇంటికి వెళ్ళి పరమార్శించారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎల్లప్పుడు మనోధైర్యముతో ఉండాలని బిఆర్ఎస్‌పార్టీ ముఖ్యనాయకులు మీ అందుబాటులో ఉంటారని కార్యకర్తలు గుర్తుంచు కోవాలనిసూచించారు.మైనోద్దీన్ హైద్రాబాద్‌లోని వెల్‌నెస్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని ఇంటికి రావడంతో ఆరోగ్యపరిస్తితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమములో పిఎసిఎస్ చైర్మెన్ ప్రబాకర్‌రెడ్డి,దోమమండల మాజి జడ్‌పటిసి లక్ష్మయ్య,దోమ మాజి సర్పంచ్ రాజిరెడ్డి,పార్టీయూత్ అద్యక్షులు ముచ్చెందర్‌రెడ్డి,నాయకులు కోసునం నరెందర్‌రెడ్డి, ఫకీర్‌మైనోద్దిన్ పాల్గోన్నారు.

## మిత్రునికి ఆర్థిక సాయం



మిత్రునికి ఆర్థిక సహాయం చేస్తున్న తోటి మిత్రులు

**దోమ,డిసెంబరు 3 ప్రభాతవార్త** : మండల పరిదిలోని మోత్కూర్ గ్రామానికి చెందిన మడుగుతిరుపతయ్య(జవాన్) తన భార్య నాలుగు రోజు క్రితంఅనారోగ్యంతో మృతి చెందింది.ఈ విషయం తెలుసుకున్నతోటి మిత్రులైన 2015 బ్యాచ్ క్లాస్‌మెట్ మిత్రులు మంగళ ˇవారం నాడు మడుగు వెంకటయ్యనుపరమార్శించి మనోధైర్యాన్ని అందించారు.ఆర్టీలరి సెంటర్‌తో పాటు సహ మిత్రులు అందరు కలిసి ఇరువైఅయిదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమములో మడుగు శ్రీనివాస్, చంద్రయ్య, శ్రీనివాస్, అంజి, సత్యం,రమేష్,క్రిష్ణ పాల్గోన్నారు.

## విద్యుత్ ఏఈగా యశ్వంత్



బాధ్యతలు చేపట్టిన ఏఈ యశ్వంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

**ఘట్‌కేసర్,డిసెంబరు 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ విద్యుత్ ఉపకేంద్రం ఏఈగా యశ్వంత్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏఈ బలరాంనాయక్ ఇటీవల లంఛం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడగా జైలుకు తరలించారు. ఈమేరకు టిజిఎస్‌పిడిసిఎల్ సీఎండీ కార్యాలయం నుంచి యశ్వంత్‌ను ఘట్‌కేసర్‌కు బదిలీ చేశారు. యశ్వంత్ ఉపకేంద్రంలో ఏఈగా బాధ్యతలు సీ ్వకరించారు. ఈసందర్భంగా సిబ్బందితో సమావేశమై నిర్వహణపై సమీక్షించారు. ఇటీవల ఏడిఈగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్‌రెడ్డిని, ఏఈ యశ్వంత్‌ను ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీ నాయకులు శాలువాతో సన్మానించారు. కరెంట్ సమస్యలు పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని వారు కోరారు. ఈడబ్ల్యుఎస్‌కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, ప్రధానకార్యదర్శి శశిధరణ్, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, నాయకులు గొరకంటి రవీందర్, శివరాత్రి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లిలో 2కె రన్

**శంకర్‌పల్లి, డిసెంబరు 3 (ప్రభాత వార్త):** ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ్మ ప్రవీణ్ కుమార్ 2కే రన్ ను జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. మానవుడి శరీరానికి వ్యాయామం ఎంతో అవసరమని ప్రతిరోజు కాలినడక ద్వారా తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. ఇంద్రారెడ్డి చౌరస్తా నుండి బీడియల్ చౌరస్తా వరకు 2రే రన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజసేవే లక్ష్యం

**బిఆర్ఎస్ యువనాయకుడు నందారం అశోక్ యాదవ్**

**షాద్‌నగర్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** సమాజసేవే లక్ష్యంగా ముందుకు కొనసాగుతానని, భవిష్యత్తులో షాద్‌నగర్ నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని షాద్‌నగర్ బిఆర్ఎస్ యువనాయకుడు నందారం అశోక్‌యాదవ్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు కావాల్సిన సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఒకలక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు తనకు ఆనందాన్ని కలిగిస్తాయని అశోక్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పద్మావతి, కళావతి, పేపర్ శివ, మాల మహేష్, బాలాజీ, కృష్ణారెడ్డి, దేవగిరి సంతోష్, శ్రీరామ్, దేవగిరి మహేష్, నాని గౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## వంతెన పనులకు అధికారులు శ్రద్ధ చూపాలి



ఘట్‌కేసర్‌లో నిరాహారదీక్ష చేస్తున్న నాయకులు

**ఘట్‌కేసర్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు పూర్తిచేసి వాహనదారుల సమస్యలను తీర్చాలని జెఏసి కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌ఓబి పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారంతో 3వ రోజుకు చేరాయి. ఈసందర్భంగా కొండాపూర్‌కు చెందిన రైతుసేవా సహకార సంఘం డైరక్టర్ రేసు లక్ష్మారెడ్డి, నాయకులు చిల్కూరి రామలింగారెడ్డి, మండడి శ్రీనివాస్‌రెడ్డి, బొంత సుధాకర్, మొల్గురం జంగయ్య, చిల్కూరి సుధాకర్‌రెడ్డిలు దీక్షలో కూర్చున్నారు. మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, జెఏసి కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, బండారి అంజనేయులు, మాజీ ఎంపిటిసి చిల్కూరి గోపాల్ రెడ్డిలు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. వంతెన పూర్తి కాకపోవడంతో గేటు అవతలున్న ప్రజలకు తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రభుత్వం శ్రద్ధ చూపి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## పరస్పర సహకారంతో పనిచేద్దాం



నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

**నవాబుపేట డిసెంబరు 3, ప్రభాతవార్త:** అధికార కాంగ్రెస్ పార్టీలో కొందరు మండల, నియోజక వర్గస్థాయి నాయకులు కొన్నాళ్ళుగా అలకపాన్పు ఎక్కారు. వారితో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం మండల కేంద్రంలో వారితో సుదీర్ఘ మంతనాలు జరిపారు. భేషజాలు లేకుండా ప్రజల కొరకు కలిసి పనిచేయడానికీ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారడంతో కొందరు నాయకులు కొంత దూరాన్ని పాటించారు. ఈ నేపథ్యంలో వారీ అభిష్టం మేరకు చర్చలు జరిపారు. కలిసి నడిచేందుకు వారు భేషజాలు ప్రక్కన పెట్టి ముందుకు వచ్చారు. ఇది శుభపరిణామమని సాటి నాయకులు కితాబు నిచ్చారు. సమీష్టికృషితో ప్రజసేవకు నడుంబిగించాలని ఎమ్మెల్యే వారిని స్వాగతించారు. దీంతో మండలంలో గ్రూపు రాజకీయాలకు తెరపడింది.

## చీర్యాల డబుల్ బెడ్‌రూం కాలనీవాసుల ధర్నా



ధర్నా చేస్తున్న చీర్యాల డబుల్ బెడ్ రూం కాలనీవాసులు

**కీసర, డిసెంబరు 3, ప్రభాతవార్త:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల డబుల్ బెడ్‌రూం కాలనీవాసులు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గత ఐదు సంవత్సరాలుగా మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీవాసులను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. డబుల్ బెడ్ రూం కాలనీలో సుమారు 40 కుటుంబాలకు విద్యుత్, నీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి ప్రాథమిక సదుపాయాలు లేక నిత్యం చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యుత్ లేని కారణంగా రాత్రి సమయంలో పిల్లలు చదువుకోలేక పోతున్నారన్నారు. ఇంటి పనులు సక్రమంగా నిర్వహించలేకపోవడంతో వారి జీవితాలను మరింత కఠినతరం చేస్తోందన్నారు. అదనంగా ఏఈ మురళి విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో వారి ఆర్థిక పరిస్థితి చెదిపోతుందన్నారు. ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా డబుల్ బెడ్ రూం కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్ అశోక్‌కుమారకి వినతిపత్రం అందజేశారు.

## ప్రజాపాలనను విజయవంతం చేయాలి

**కీసర, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనను విజయవంతం చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని కుందన్‌పల్లి వైజాగ్ డిఫెన్స్ అకాడమీ నుండి మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వరకు 2కే రన్‌ని నిర్వహించడం జరిగింది. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని సాయిభవానీ ఫంక్షన్‌హాల్‌లో బస్తీ దవఖానా డాక్టర్స్‌తో ఆర్మీ డెంటల్ హస్పిటల్, ఆర్ఆర్ హస్పిటల్ డాక్టర్స్‌తో మున్సిపల్ సిబ్బందికి హెల్త్ క్యాంపును నిర్వహించడం జరిగింది.

## ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ

**కొడంగల్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా అర్బన్‌డే సందర్భంగా కొడంగల్ పురపాలక సంఘం అద్వర్యంలో పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ చేపట్టారు. అలాగే ఉత్తమ కార్మికులకు సన్మానం, శానిటేషన్ వర్కర్‌లకు హెల్త్ క్యాంప్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పురపాలక సంఘం చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అద్యక్షతన నూతన పురపాలక సంఘం కార్యాలయంలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు సన్మానం చేశారరు. అలాగే మెప్మా విభాగానికి సంభందించి ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలకు చెక్కులు అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, మున్సిపల్ అధికారులు భరత్‌లతో పాటు మెప్మా రిసోర్స్ పర్సన్‌లు అనందమ్మ, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ టీచర్లా..? లేక వీధి రౌడీలా..?

**బిఆర్ఎస్వీ ఉస్మానియా విద్యార్థి సంఘం నాయకుడు చిటారి దశరథ్**
**రెసిడెన్షియల్ పాఠశాల పరిశీలకు 'నో' చెప్పిన సిబ్బంది**
**బిఆర్ఎస్వీ నాయకుల ఆందోళన.. అరెస్టు**



బిఆర్ఎస్వీ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**షాద్‌నగర్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రెసిడెన్షియల్ టీచర్లా.. లేక వీధి రౌడీలా అంటూ బిఆర్ఎస్వీ అనుబంధ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు చిటారి దశరథ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి ప్రభుత్వ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బ్యాక్ వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించడానికి వెళ్లిన బిఆర్ఎస్వీ నాయకులను పాఠశాల సిబ్బంది లోపలికి అనుమతించలేదు. దీంతో చాలా సేపు పాఠశాల సిబ్బందికి, బిఆర్ఎస్వీ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలిగించేలా సందర్శనకు రావద్దని సిబ్బంది సూచించారు. ఒకవేళ రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించడానికి ఉన్నతాధికారుల నుంచి ఏదైనా అనుమతి ఉందా అని ప్రశ్నించారు. దీంతో తాము కచ్చితంగా పాఠశాలను పరిశీలించి, వసతులు, సౌకర్యాల కల్పన ఎలా ఉన్నాయో చూస్తామని చెప్పడంతో సిబ్బందికి, బిఆర్ఎస్వీ నాయకులకు మధ్య వివాదం పెరిగింది. దీంతో పాఠశాల సిబ్బంది స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి బిఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేసి షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**చాలా అన్యాయం...**

గత 11 నెలలుగా రాష్ట్రంలో గురుకులాల వ్యవస్థ దారుణంగా ఉందని, విద్యార్థులకు బాసటగా నిలిచి సమస్యలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుంటే ముఖ్యమంత్రి అనుమతి కావాలి లేదా ఉన్నతాధికారుల అనుమతి కావాలని తమ పర్యటనను అడ్డుకున్న చటాన్‌పల్లి మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయుల తీరు వీధిరౌడీల్లా ఉందంటూ చిటారి దశరథ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మంగళవారం బిఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాఠశాల సందర్శనకు స్థానిక బిఆర్ఎస్వీ నాయకులతో కలిసి రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్లగా అక్కడి సిబ్బంది అనుమతించలేదు. ఇరువర్గాల మధ్య వివాదం సంతరించుకుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల పరిస్థితులను తెలుసుకునేందుకు వస్తే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. విద్యార్థి నాయకుడిగా ఇక్కడి పరిస్థితులను తెలుసుకునే హక్కు తమకుందని, విద్యార్థుల తల్లిదండ్రులకు ఇక్కడి పరిస్థితులను వివరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలను చూడడానికి అనుమతివ్వని ఈ వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని బిఆర్ఎస్వీ నాయకుడు చిటారి దశరథ్ ఘాటుగా వారిని హెచ్చరించారు.

# అమరుని త్యాగాన్ని తెలంగాణ ఎన్నటికీ మరవదు

**శ్రీకాంతచారి త్యాగాన్ని గుర్తించని బిఆర్ఎస్**
**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



శ్రీకాంతచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ నాయకులు

**షాద్‌నగర్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** నెత్తురు చుక్క చిందకుండా.. ప్రాణత్యాగం జరగకుండా ఏ ప్రజా ఉద్యమమూ విజయం సాధించిన ఆనవాళ్లు లేవని చరిత్ర చెబుతుందని, ఎందరో అమరవీరులు తమ రక్తాన్ని ధారపోస్తేనే తెలంగాణ రాష్ట్రం కల సాకారమైందని, శ్రీకాంతచారి త్యాగాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ మరవదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ అమరవీరుడు కాసోజు శ్రీకాంతచారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. తొలిదశ ఉద్యమంలో 369 మంది ప్రాణాలు అర్పిస్తే, మలిదశ ఉద్యమంలో 1200 మందికి పైగా అమరులయ్యారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మార్పణచేసుకున్న తొలి ఉద్యమకారుడు శ్రీకాంతచారి అని కొనియాడారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతచారి కుటుంబానికి కెసిఆర్ చేసిన మంచి ఏమీ లేదని విమర్శించారు. గత పదేళ్లలో శ్రీకాంతచారి తల్లి శంకరమ్మకు కెసిఆర్ ఎలాంటి న్యాయం చేయలేకపోయారని, గత పార్లమెంటు ఎన్నికల్లో శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాల పునాదులపై పాలించిన కెసిఆర్ ఆయన కుటుంబ సభ్యులు మాత్రమే రాష్ట్రంలో బాగుపడ్డారని, అమరుల కుటుంబాలకు ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ కార్యక్రమలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ నేతలు విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, మురళీ మోహన్ (అప్పి), రఘు, సర్వర్‌పాష, శ్రీకాంత్ రెడ్డి, చెంది తిరుపతి రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, మానపాటి ప్రదీప్ కుమార్, శ్రీను నాయక్, శుక్రవర్ధన్ రెడ్డి, బబ్లు, బచ్చలి నరేష్, చిన్న, మన్నె రవి, గంగమోని సత్తయ్య, కటిక ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో నేరప్రవృత్తిని కట్టడి చేద్దాం

**నందిగామ, డిసెంబరు 3, ప్రభాతవార్త:** సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న నేరప్రవృత్తిని కట్టడి చేయడానికి సిసి కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని నందిగామ సర్కిల్‌ఇన్స్పెక్టర్ పి.ప్రసాద్ అన్నారు. నందిగామ మండలం వెంకమ్మగూడలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణలో, నేరాలను, దొంగతనాలను అరికట్టడంలో సిసి కెమెరాల పాత్ర అమోఘం అన్నారు. ఒక్క సిసి కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. ఈ మధ్యకాలంలో కొందరు గుప్తనిధుల పేరుతో, దేవాలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసంచేసి మత విద్వేషాలను సృష్టిస్తూ అరాచకాలకు పాల్పడుతున్న సంఘటనలు చోటుచేసుకున్న దరిమిలా మాజీ సర్పంచ్ బుయ్యని రజనీత వీరేందర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గుండాల వేణుగోపాల్, చేగురు సింగిల్ విండో చైర్మన్ గొల్లపల్లి అశోక్, కాంగ్రెస్ నాయకుడు స్వాములయ్య, ఎం.మధు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణ, రక్షణే ధ్యేయంగా శాంతిభద్రతల పర్య వేక్షణలో పోలీసులు శ్రమిస్తున్నారని, సమాజవికాసంలో యువకులు పోలీసు లకు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**కొత్తూర్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, కాంగ్రెస్‌పార్టీ మున్సిపల్ అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్ అన్నారు. కొత్తూర్ పురపాలకలో రాష్ట్రప్రభుత్వ పిలుపు మేరకు విజయోత్సవ సంబరాల్లో భాగంగా మంగళవారం పాత మున్సిపల్ నుండి వై-జంక్షన్, కొత్తూర్ పురపాలకలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....తెలంగాణను సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమరంగాల్లో శరవేగంగా అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. ఇందుకు ఉదాహరణే రైతులకు రుణమాఫీ చేయడం అని గుర్తుచేశారు. ఆరుగ్యారంటీలతో రాష్ట్రాభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అన్ని శాఖల అధికారులు, ప్రజలు, యువత భాగస్వామ్యం వహించాలన్నారు. అభివృద్ధిని మరోసారి ప్రజలకు వివరించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మెన్ డోలీ రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్, కర్రోళ్ల సురేందర్, చిల్కమర్రి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణకే షీ టీమ్స్

**నందారం అశోక్ యాదవ్**

**షాద్‌నగర్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** విద్యార్థినులు, మహిళల రక్షణే షీ టీమ్ కర్తవ్యమని షీటీమ్ ఇంచార్జి తెలిపారు. మంగళవారం కమ్మదనం సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ విద్యుల్లత ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు జీవితంలో చక్కని లక్ష్యాన్ని నిర్దేశించుకొని సరైన మార్గంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పోక్సో యాక్ట్‌పై చైతన్యం పేరుతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫేస్‌బుక్, వాట్స్‌యాప్, ఇన్‌స్టాగ్రామ్, వంటి వాటిని ఉపయోగించడంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఫోటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప మొబైల్స్ వాడకూడదని, అత్యవసయ సమయంలో డయల్ 100కి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయోత్సవాల్లో భాగంగా అర్బన్ డే

**కీసర, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఘనంగా అర్బన్‌డేను నిర్వహించడం జరిగింది. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, మహిళాసంఘాల సభ్యులతో కలిసి జిల్లా పరిషత్ పాఠశాల నుండి ఎంవైఆర్ ఫంక్షన్‌హాల్ వరకు అర్బన్‌ర్యాలీని నిర్వహించడం జరిగింది. అనంతరం పారిశుధ్య కార్మికులకు భద్రతాపరికరాలు, పిపి కిట్లు, పారిశుధ్య కార్మికులకు సన్మానం, మెడికల్ క్యాంపును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహిళాసంఘాలకు 2కోట్ల 36లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కమీషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చింతల సరిత, ఎలిజాల నాగేష్, గోక కళావతి, తిరుమంగలలక్ష్మీ, లావణ్య శ్రీనివాస్, కౌకుట్ల అనంతరెడ్డి, గూడూరు సబిత ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తూంకుంట రోడ్డు వెడల్పు బాధితుల ఆందోళన




తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన వ్యక్తంచేసిన దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 3, ప్రభాతవార్త:** తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద తూంకుంటలో రోడ్డువెడల్పు బాధితులు తమకు న్యాయంచేయాలని డిమాండ్‌చేస్తూ తూంకుంట మున్సిపల్ కార్యాలయంవద్ద ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం రోడ్డువెడల్పు విషయంపై అధికారులు తూంకుంట మున్సిపాల్టీకి అభిప్రాయ సేకరణకు వస్తున్నట్లు సమాచారం అందుకున్న బాధితులు షాపులు బంద్‌చేసి పెద్ద ఎత్తున చేరి తమకు న్యాయంచేయాలని, రోడ్డువెడల్పు తగ్గిస్తూ పనులు పనులు చేపట్టాలని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. రాజీవ్ రహదారి రోడ్డు వెడల్పు విషయంపై మంగళవారం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని హకీంపేట్, పోతాయిపల్లి, తూంకుంట గ్రామాల ప్రజలతో మేడ్చల్‌జిల్లా డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ అధికారి శంకర్‌కుమార్ విచ్చేసి అభిప్రాయ సేకరణకోసం గ్రామసభలను నిర్వహించి అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. నగరంలోని జూబ్లి బస్‌స్టేషన్ నుంచి తూంకుంట మున్సిపాల్టీ మీదుగా శామీర్‌పేట ఓఆర్ఆర్ సర్కిల్ వరకు రాజీవ్‌రహదారి రోడ్డువెడల్పు పనులకు శ్రీకారంచుట్టింది. జెబిఎస్ నుంచి తూంకుంట-శామీర్‌పేట ఓఆర్ఆర్ సర్కిల్ వరకు రోడ్డువెడల్పు పనులు చేపట్టటం జరుగుతుంది. అయితే తూంకుంట, పోతాయిపల్లి, హకీంపేట్ గ్రామాలవద్ద రాజీవ్‌రహదారిన మెయిన్‌రోడ్డుకు ఇరువైపుల రోడ్డు వెడల్పు 200ఫీట్లతో చేపట్టటానికి ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని హకీంపేట్, పోతాయిపల్లి, తూంకుంట గ్రామాల పరిధిలో ఉన్న రాజీవ్‌రహదారి ఉన్నందున రోడ్డు వెడల్పునకు రాష్ట్రప్రభుత్వం రాజీవ్ రహదారి పక్కన స్థలాలు, షాపులు, ఆస్తులు కోల్పోతున్న ప్రజలతో అభిప్రాయాలు, అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరటం జరిగింది. ప్రభుత్వ దృష్టికి తీసుకెళతానని జిల్లా భూసేకరణ అధికారి తెలిపినట్లు బాధితులు పేర్కొన్నారు.

## అప్పా జంక్షన్-మన్నెగూడ రోడ్డుపనులు ప్రారంభం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

**చేవెళ్ళ, డిసెంబరు 3, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు మంగళవారం ప్రారంభం చేశామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడించారు. చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ చేవెళ్ల మండలం అలురు గ్రామ స్టేజి సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి ఐదులక్షల ఎక్స్‌గ్రేషియా, ఎన్‌హెచ్ఎఐ ద్వారా 2లక్షల రూపాయలను ప్రభుత్వం సహాయం అందజేస్తుందన్నారు. సిఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తరువాత రోడ్డుపనులు జరిగేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో రోడ్డుపనులను త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతుందన్నారు.

## ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే

**నందిగామ, డిసెంబరు 3, ప్రభాతవార్త:** నందిగామ మండలం వీర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు గతేడాది నుండి జీతాలు రాక అతని కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం శ్రీనివాస్ కు రూ.30 వేలు అందజేసి ధైర్యం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి ఎం శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, మాజీ ఎంపిటిసి దేపల్లె కుమార్ గౌడ్, నాయకులు చిందం నరసింహులు, ప్రభాకర్ రెడ్డి, కుమారస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

**శామీర్‌పేట, డిసెంబరు 3, ప్రభాతవార్త:** తుర్కపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలుర పాఠశాలలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమైనాయి. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల బాలుర పాఠశాలలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను ఎంజెపిటిబిసి డబ్ల్యుఆర్ఇఐఎస్ జాయింట్ సెక్రటరీలు జి.తిరుపతి, శ్యాంప్రసాద్‌లాల్‌లు విచ్చేసి ప్రారంభించారు. వివిధ జిల్లాలకు చెందిన ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జి.తిరుపతి, శ్యాంప్రసాద్‌లాల్, హైదరాబాద్ ఆర్‌సిఓ ఆదిత్యవర్మ, రంగారెడ్డి ఆర్‌సిఓ యాదయ్యగౌడ్, తుర్కపల్లి ప్రిన్సిపల్ డాక్టర్ వై.రవికుమార్, అనిల్‌కుమార్‌నాయక్‌లు జ్యోతిప్రజల్వన చేసి ప్రారంభించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ నెల 3నుంచి 6వ తేదీ వరకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. జాయింట్ సెక్రటరీలు జి.తిరుపతి, శ్యాంప్రసాద్‌లాల్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని, దేహదారుఢ్యానికి దోహదపడుతాయని అన్నారు. విద్యార్థులను ప్రభుత్వం క్రీడల పోటీలను నిర్వహించి ఉత్తేజపరుస్తున్నట్లు, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో ప్రిన్సిపల్ వై.రవికుమార్, ఎటిపి అనిల్‌కుమార్, డిడబ్ల్యుఎ నర్సింలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి విస్తరణ పనులు



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య తదితరులు

**పూడూరు, డిసెంబరు 3, ప్రభాతవార్త:** అభివృద్ధిపై చిత్తశుద్ధిలేని బిఆర్ఎస్ పార్టీ నాయకులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించడం ఎంతవరకు సమంజసమని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్‌రెడ్డి నిలదీశారు. హైద్రాబాద్-బీజాపూర్ 163 జాతీయ రహదారి అప్పా జంక్షన్‌నుండి మన్నెగూడ వరకు నిర్మించ తలపెట్టిన నాల్గులైన్ల రోడ్డు విషయంపై స్పష్టతనిచ్చేందుకు మంగళవారం పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ ఫాంహౌస్‌లో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరుగేట్ వద్ద జరిగిన లారీ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపి, మృతుల కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు తొలగించొద్దని ఎన్‌జిటి నేషనల్ గ్రీన్‌ట్రుబ్యునల్‌లో కేసులు వేస్తే రేవంత్ ప్రభుత్వం కేసులను కొట్టేయించి గతనెల 28వ తేదీనుండే మృగవాణి, కనకమామిడి సమీపాల్లో నిర్మాణపు పనులు ప్రారంభించిందని వివరించారు. ఇందుకోసం 330 ఎకరాల భూములకు రూ.135 కోట్లు భూపరిహారం రైతులకు అంజేయడం జరిగిందన్నారు. పూడూరు మండలం దామగుండంలో నేవీ రాడార్ ఏర్పాటు చేస్తున్నామని, వికారాబాద్-కృష్ణ రైల్వేలైన్ ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వం




పట్టణంలో విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**తాండూరు, డిసెంబరు 3, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని.. చెప్పినవన్ని తప్పకచేసి తీరుతుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పూరింత చేసుకున్న సందర్భంగా మంగళవారం తాండూరు పట్టణంలో చేపట్టిన విజయోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలో అంబేద్కర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇండ్లు, రేషన్ కార్డులు, ఫించన్‌లు అందించడం జరిగిందని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే సిలిండర్ ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. రూ21వేల కోట్ల రుణమాఫీ చేసిందని, స్కూల్లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, పుస్తకాలు అందించడం జరిగిందని వివరించారు. మెస్ చార్జీలు పెంచి, నాణ్యమైన భోజనం అందిస్తుందన్నారు.

## నీటి సమస్యపై కౌన్సిలర్ చొరవ



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్

**ఆమనగల్లు, డిసెంబరు3, ప్రభాతవార్త:** ఆమనగల్లు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎదురవుతున్న నీటి సమస్యను స్థానిక కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ చొరవ చూపి పరిష్కరించారు. పైపు లైన్ ధ్వంసం కావడంతో నీరు అందక విద్యార్థులు గత కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కౌన్సిలర్ వెంటనే స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు. అనంతరంలక్ష్మణ్ విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రకారం మెనును అనుసరించి విద్యార్థులకు భోజనం అందజేయాలని ఆయన సూచించారు. నీటి సమస్య పరిష్కారానికి చొరవచూపిన కౌన్సిలర్‌ను పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు ఆమనగల్లు విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ పాండు

**ఆమనగల్లు, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైయిర్ సైన్స్ ప్రదర్శనకు ఆమనగల్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సునీల్ ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా తరపున ఈయన రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇంఛార్జీ ఎంఈఓ పాండు తెలిపారు. మాణిక్ ఎగ్జిబిషన్ 12వ ఇన్‌స్పైయిర్ అవార్డ్సు కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నుండి 650 పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనగా, అందులో 9 ఎగ్జిబిటర్స్‌ను ఎంపిక చేశారు. అందులో ఆమనగల్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సునీల్ రోజువారి జీవితంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు ఆయన వివరించారు. కాగా ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు ప్రోత్సహించిన బౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బాలనాగయ్యను మంగళవారం ఎంఈఓ పాండు పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారిని శాలువాతో సత్కరించి ప్రతిభ చాటిన విద్యార్థికి రూ. 500 నగదు రివార్డును అందజేశారు. ఉపాధ్యాయులు రామస్వామి, కృష్ణయ్య, అశోక్‌రెడ్డి,ఆచారి, మాధవి, మధుకర్, సుధాకర్, రమాదేవి, కుసుమలత, మెర్సీలియా, మాలతి, వనిత, పద్మ, సల్మాన్‌రాజ్‌లు పాల్గొన్నారు.

## సంబురంగా దివ్యాంగుల దినోత్సవం



ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న ఇంచార్జీ ఎంఈఓ పాండు

**ఆమనగల్లు, డిసెంబరు3, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఉల్లాస భరిత వాతావరణంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక దినోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎంఈఓ పాండు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈసంధర్బంగా ఎంఈఓ పాండు సమక్షంలో దివ్యాంగులు వివిధ రకాల ఆటవిడుపు, క్రీడలలోపాల్గొని సందడిచేశారు. నిర్వహకులు కార్యక్రమాన్ని ఎంతో సంబురంగా నిర్వహించారు. క్యారమ్, క్రికెట్, పరుగుపందెం, మ్యూజికల్ చైర్, గోలి వంటి క్రీడలలో పాల్గొని ఆకట్టుకున్నారు. గెలుపొందిన దివ్యాంగులకు రూ. 5వేల రూపాయల విలువ గల బహుమతులు అందజేశారు. ఈసంధర్భంగా ఎంఈఓ పాండు మాట్లాడుతూ దివ్యాంగులను అక్కున చేర్చుకుని ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సకలాంగులతో పాటు దివ్యాంగులను సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో కట్టయాదయ్య, లావణ్య, సీఆర్‌పీ కిషన్, కంప్యూటర్ ఆపరేటర్ సాయికుమార్ పాల్గొన్నారు

## మహిళలకు చీరెల పంపిణీ



చీరలు అందజేస్తున్న మాజీ జెడ్పీటీసి ఉప్పల వెంకటేష్

**తలకొండపల్లి (డిసెంబర్ 3),** ప్రభాతవార్త తలకొండపల్లి మండలంలోని చీపునుంతల గ్రామంలో మంగళవారం నాడు తలకొండపల్లి మాజీ జెడ్పీటిసి ఉప్పల వెంకటేష్ మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. తన చిన్న కుమారుడు వివాహం సందర్భంగా మండలంలోని మహిళలందరికీ ఉచితంగా చీరలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ, తమ కుటుంబంలో వివాహం సందర్భంగా మండలంలోని ప్రతి ఒక్క మహిళకు చీరలు అందజేస్తామని అందరు సద్వినియోపరుచుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం చీపునంతల గ్రామంలోని ఇంటింటికి తిరిగి మహిళలకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉప ధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, బి ఆర్ఎస్ నాయకులు నరోత్తం రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, బాల కుమార్, మధు తోపాటు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

### సకలాంగులతో సమానంగా దివ్యాంగులు

**బొంరాస్‌పేట్,డిసెంబరు 3, ప్రభాతవార్త:** ప్రతి సంవత్సరం డిసెంబర్ 3వ తేదిన మండలంలో కమిట్మెంట్స్ ఎంవిఎస్, ఎంఎంఎస్ సహకారంతో దివ్యంగుల దినోత్సవం నిర్వహించడం రుగుతుందన్నారు. బొంరాస్ పేట్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వికలాంగుల దినోత్సవం నిర్వహించడం జరిగింది. బొంరాస్ పేట్ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, పిఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, పార్టీ అధ్యక్షులు నర్సిములు గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలోమార్కెట్‌కమిటీసభ్యులు మల్లేష్, బందప్ప, శ్రీకాంత్, ఆర్ఐ శిరీష, సీసీ రాంచంద్రయ్య, విజయవర్ధన్, వంశీ, అధికారులు, వికలాంగులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పనులు వెంటనే చేపట్టాలి

-అలూరు నుండి చేవెళ్ల వరకు పాదయాత్ర చేసిన గ్రామస్తులు
చేవెళ్ల మండల కేంద్రంలో ధర్నా నిర్వహించిన నాయకులు



చేవెళ్ల మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న మండల ప్రజలు

**చేవెళ్ళ, డిసెంబరు3, ప్రభాతవార్త :** చేవెళ్ల మండలం మీదుగా వెళ్తున్న హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని చేవెళ్ళ మండల ప్రజలు డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు మండలంలోని ప్రజలందరు రోడ్డుపనులను వెంటనే ప్రారంభించాలని పెద్దఎత్తున ధర్నా చేశారు. చేవెళ్ళ మండల కేంద్రంలోని జాతయ రహదారిపై ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. గత సంవత్సరన్నర క్రితం మంజూరైన టెండర్ వర్క్‌ను ఎందుకు రోడ్డు పనులు చేపట్టడం లేదని ప్రజలు అగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతోనే రోడ్డు పనులు కాలేదని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

రోడ్డు వెడల్పులేకపోవడంతో తరచు రోడ్డు ప్రమాదాలుజరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రజల ప్రాణాలంటే ప్రభుత్వంకు లెక్కలేదని విమర్శించారు. రోడ్డు పనులను ప్రారంభించకుంటే పెద్ద ఎత్తునఅందోళనలు ఉధృతం చేస్తామన్నారు. పాలకులు ఎన్నికలప్పుడుమాత్రమే జనం గుర్తుకువస్తారా అని నిలదీశారు. ప్రభుత్వంరోడ్డు పనులు విస్తరించేందుకు కసరత్తులు ప్రారంభించిదని, అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, ప్రభుత్వంకు ప్రజలు సహకరించాలని అర్డిఓ చంద్రకళ, డిసిపి శ్రీనివాస్,ఎసిపి కిషన్,సిఐశ్రీధర్‌భూపాల్ సూచించారు.

గ్రీన్‌ట్రిబునల్‌లో కేసు ఉండటంతో రోడ్డు పనులువిస్తరణలో జాప్యం జరుగు తుంద న్నారు. కార్యక్రమంలోచేవెళ్ల పార్లమెంట్ బిఆర్ఎస్ ఇంచార్జి పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి,చేవెళ్ల మాజీ ఏమ్మేల్యే కెఎస్ రత్నం, నియోజవర్గ ఇంచార్జి దేశమోళ్ల అంజనేయులు, మాజీ ఎంపిపి బాల్‌రాజ్, బిఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు ప్రభాకర్,బిజెపి సీనియర్ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డి,సీనియర్‌నాయకులు నారాయణ, శ్రీనివాస్‌గౌడ్,ప్రభాకర్‌రెడ్డి,శైలజరెడ్డి, సమతారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభులింగం, రామస్వామి, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్.గుత్తి మల్లేష్ పాల్గోన్నారు.

## జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు

### అడ్డుకున్న ఎన్‌జిఓ తేజపై చర్యలు తీసుకోవాలి



తేజపై క్రిమినల్ కెసును నమోదు చేయాలని చేవెళ్ల సిఐ శ్రీధర్ భూపాల్‌కు పిర్యాదు చేసిన చేవెళ్ల మాజీ ఏమ్మేల్యే కెఎస్ రత్నం

**చేవెళ్ళ, డిసెంబరు 3, ప్రభాతవార్త :** జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు జరుగకుండా ఎన్‌జీఓ తెజపై చర్యలు తీసుకోవాలని చేవెళ్ల సిఐ శ్రీధర్ భూపాల్‌కు మాజీ ఏమ్మేల్యే కెఎస్ రత్నం పిర్యాదు చేశారు. జాతీయ రహదారి విస్తరణ పనులు చేయకుండా రోడ్డు పక్కన గల మర్రి చెట్లను తొలగించవద్దని గ్రీన్ ట్రిబ్యునల్‌లో కెసు వెసిన ఎన్‌జీఓ నేత తేజపై క్రిమినల్ కెసులు నమాదు చేయాలని, రోడ్డు ప్రమాదాలకు కారణమౌతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు పనుల చేసేందుకు ప్రభుత్వంనిధులు మంజూరు చేసిన చెట్లను తోలగించ కుడదని కెసు వెసి రోడ్డు ప్రమాదాలకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మల్గారి వైభవ్‌రెడ్డి,అనంతరెడ్డి,శ్రీకాంత్‌రెడ్డి, ఇక్కరెడ్డిగూడ వెంకట్‌రెడ్డి, సామ మాణిక్యరెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా శ్రీకాంతచారి 15వ వర్ధంతి



కడ్తాల్‌లో శ్రీకాంతచారి 15వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**కడ్తాల్ డిసెంబరు 3, ప్రభాత వార్త:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలిప్రాణత్యాగం చేసిన కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతి వేడుకలు కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడ్తాల్ మాజీ జెడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాలేసి నివాళు లర్పించారు. అనంతరం అయిన మాట్లాడుతూ శ్రీకాంత్ చారి తొలి ప్రాణ త్యాగమే రాష్ట్ర ఏర్పాటుకు పునాది పడిందని తెలిపారు.

రాష్ట్రం కోసం తన నిండు ప్రాణాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి శ్రీకాంత్ చారి అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బావండ్ల పల్లి ఆనంద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్,నాయకులు నరసింహ,లక్ష్మణాచారి, శ్రీను నాయక్, పాండునాయక్, రామచంద్రయ్య,మహేష్, వెంకటేష్, అంజి,శ్రీను,కృష్ణ, కుమార్,పాండు,దేవా, మల్లేష్,వెంకటేష్, సూర్య, బన్సీ ,యాదయ్య, కిషన్, నాగేష్,రాజేష్, సక్రు, జగన్, వినోద్ , శ్రీకాంత్, టిల్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నాడు బిఆర్ఎస్,నేడు కాంగ్రెస్ ప్రజాద్రోహ ప్రభుత్వాలే

**ఎన్నికల్లో ఇచ్చిన హమీలను మర్చి స్వార్ధరాజకీయాలు చేస్తున్నారు**

**మొయినాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త :** పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ప్రజాద్రోహుల పాలయిందని, బిజెపి మొయినాబాద్ మండల అధ్యక్షుడు మామిడి మధుసుదన్ రెడ్డి అన్నారు, ఎన్నో ఏళ్ళుగా పోరాటాలు చేసి, ప్రాణత్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు తెరలయితున్న పట్టించుకోని ప్రభుత్వాలు ఉన్నాయని ఆరోపించారు, మంగళవారం మొయినాబాద్ మండల అధ్యక్షుడు మామిడి మధుసుదన్ ఆధ్వర్యంలో మండల నయబ్‌తహాశీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతపత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా మధుసుదన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హమీలను అధికారంలోకి వచ్చినకా కాంగ్రెస్ ప్రభుత్వం మరిచి వారి స్వార్ధ స్వలాభన రాజకీయలు చేస్తున్నారని, రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని మరిచిపోయారంటు వాపోయారు, నాడు బిఆర్ఎస్, ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హమీలను మరిచి అధికారంలోకి వచ్చి హిట్లర్ పాలన చేశారని, అధిచూసి విసుగుచెందిన ప్రజలు నేడు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే ఎన్నికల్లో ఇష్టానుసారంగా హమీలిచ్చారు, కాని ఏ ఒక్క హమీని నరవేర్చడంలేదని, మొయినాబాద్ మండలంలోని గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడంలేదని, గ్రామంలో నిత్యం తలేత్యే సమస్యలను సైతం సరిచేయడానికి కజానలేదన్నారు, మండలంలోని ఏ ఒక్క గ్రామానికి సరైన రోడ్డులేదని, అభివృద్ధి చేస్తామని ప్రజలను మబ్బపెట్టి అధికారంలోకి వచ్చి ప్రజల సంక్షేమన్ని మరిచి స్వార్ధరాజకీయాలు చేస్తున్నారని, డబుల్ బెడ్‌రూమ్‌లను పేదలకు పంచలేదని, గత ప్రభుత్వం 10 ఏళ్ళలో ఒక్క రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని హమీని మరిచారని, క్రొత్త పిన్షన్‌లను మంజురుచేయలేదని, నిరుద్యోగ బృతి మాటేలేదని, మండలంలో పేదవిద్యార్డులు చదువుకోవడానికి ఇంటర్,డిగ్రీ కళశాలలను ఏర్పాటుచేస్తామని గతంలో హామీలు ఇచ్చి మరిచిపోయారన్నారు, 111 జీవో ఎత్తివేయాలని డిమాండ్ చేశారు తక్షణమే ప్రజా సంక్షేమన్ని దృష్టిలో ఉంచుకోని ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకొకపోతే బిజెపి పోరాటం ఉదృతం చేస్తామన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, బిజెకెఎం, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహరెడ్డి, ఎస్సిమోర్చ జిల్లా అధ్యక్షులు బంటు జ్ఞానేశ్వర్, బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్, మండల ప్రధాన కార్యాదర్శి మాధవరెడ్డి, సుధాకర్ రెడ్డి ఉపాధ్యక్షులు యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్ జిల్లా, మండల స్దాయి నాయకులు, మొయినాబాద్ బిజెపి కార్యాకర్తలు పెద్ద ఎత్తున పాల్గోన్నారు,



బిజెపి మండల అధ్యక్షతన నయాబ్‌తహాశీల్దార్‌కు వినతిపత్రం,

## నేతల అక్రమ అరెస్టులు



మాట్లాడుతున్న మండల బిఆర్ఎస్ నాయకులు.

**బొంరాస్‌పేట్,డిసెంబరు 3, ప్రభాతవార్త:** నాడు కేసీఆర్ హయంలో గురుకులవిద్యార్థులు కిలిమంజారో వంటి పర్వతాలు అధిరోహించారు. నేడు కాంగ్రెస్ హయంలో పురుగుల అన్నం పెట్టొద్దని రోడ్డు ఎక్కుతున్నారని మండల బీసీ సెల్ అధ్యక్షులు రవిగౌడ్, మల్లేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్టు గురుకులాలు అద్భుతంగా ఉంటే బిఆర్ఎస్ నేతలను, నాయకులను ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని అన్నారు.గురుకుల పరిస్థితిపై అధ్యయనం చేస్తే ఈ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటని, మేము గురుకులాలకు వెళ్ళేది ధర్నాలు చేసేందుకో..తరగతులు బహిష్కరించాలని చెప్పేందుకో వెళ్లడం లేదు. సమస్యలు తెలుసుకుందామని మాత్రమే వెళుతున్నామని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు, లాఠీ చార్జీలు చేస్తున్నారని అన్నారు. ఇంకా ఎన్ని రోజులు ఈ నిర్బంధాలు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పరిగి బిఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు

**పరిగి రూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ అధినాయకుడు కేటీఆర్ పిలుపు మేరకు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అదేశాల మేరకు గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం పరిగి లోని మైనారిటీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ స్కూల్లను బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలలలో ఉన్న లోపాలను జరుగుతున్న దారుణాలను బయటికి తెలియనియవద్దు అనే ఉద్దేశంతో పోలీసులను అడ్డు పెట్టుకొని, ఉపాధ్యాయుల ద్వారా అడ్డుకోవడం జరిగిందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, గురుకుల బాట జిల్లా ఇన్చార్జ్, బీఆర్ఎస్‌వి నాయకులు జంగయ్య. కౌన్సిలర్లు జాక్ రవికుమార్, తాహెర్ అలీ, మునీర్, లక్ష్మీదేవి పల్లి మాజీ సర్పంచ్ వెంకటేష్ ,రవి రెడ్డి, హరి, పరిగి టిఆర్ఎస్‌వి నాయకులు సాయి తేజ,అరుణ్, పృథ్వి రాజు, కృష్ణ, ఆసీఫ్, దీపక్, అక్రమ్ పాల్గొన్నారు.



బిఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

## రిలయన్స్ స్మార్ట్ బజార్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి : బాధితుడు శ్రీనివాస్

**పరిగి రూరల్, డిసెంబరు3 ప్రభాతవార్త:** పరిగి మున్సిపల్ పరిధిలోని రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో శ్రీనివాస్ అనే వ్యక్తి మంగళవారం గుడ్లను కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి చూడగా. కోడిగుడ్ల లోంచి పురుగులు బయటికి వచ్చాయి.
కల్తీ సరుకులు సప్లై చేస్తున్నారని భావించిన శ్రీనివాస్ స్మార్ట్ బజార్ యాజమాన్యాన్ని వెళ్ళి నిలదీశారు. దీంతో తమకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని బాధితుడు శ్రీనివాస్ తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతలేని సరుకులు ప్రజలకు విక్రయించి మోసాలకు పాల్పడుతున్నా రిలయన్స్ స్మార్ట్ బజార్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శ్రీనివాస్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ సమిష్టి కృషి ఫలితమే విజయోత్సవాలు

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మున్సిపల్ కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, డిసెంబరు 3 ప్రభాతవార్త :** గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాయంటే కాంగ్రెస్ పార్టీ పాలననే కారణమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం ప్రజాపాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా విజయోత్సవ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ముందుగా షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన 2కె రన్‌ను ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరం, మహిళా గ్రూపులకు రుణాలు, మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య హెల్త్ కిట్ల పంపిణీ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనాలు చేశారు. విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన 2కె రన్‌లో ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా పరుగులు తీశారు. పట్టణ ముఖ్య కూడలిలో మానవహారం నిర్వహించిన అనంతరంమున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పదేళ్లుగా చేయలేని అభివృద్ధిని చేసి చూపిందని అన్నారు. ఇందుకు గత ఏడాది కాలంలో షాద్‌నగర్ నియోజకవర్గంలో వచ్చిన మార్పే నిదర్శనమని, ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ పార్టీ తీసుకునే నిర్ణయాలు పేదల పాలిట వరంగా మారాయని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొటిగా నెరవేర్చుతూ ప్రజాభిమానాన్ని చూరగొంటున్న కాంగ్రెస్ పాలనను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పదిలక్షల రూపాయలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇలా పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. దీంతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలతో పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలో విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. తాము చేపడుతున్న కార్యక్రమాలకు పార్టీలకు అతీతంగా అందరు సహకరించాలని కోరారు. ఈనెల 1 నుండి 9వ తేదీ వరకు ప్రజా విజయోత్సవ సభలను నిర్వహిస్తున్నామని, ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే పాలకులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, సిఐ విజయ్ కుమార్, నాయకుడు అగ్గనూరు విశ్వం, మహ్మద్ అలీఖాన్ బాబర్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, అగ్గనూరు బస్వం, రఘు, సర్వర్ పాషా, బాల్‌రాజ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, జంగ నర్సింలు, ముబారక్, కరుణాకర్, బబ్లు, కౌన్సిలర్ శ్రీనివాస్, జమృద్‌ఖాన్, జాంగారి రవి పాల్గొన్నారు.

## దళితబంధు నిధులు విడుదల చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పత్యానాయక్

**ఆమనగల్లు, డిసెంబరు3, ప్రభాతవార్త:** దళితుల ఆర్థికాభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేసిన దళిత బంధు పథకంను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ అన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన యూనిట్ల నిధులను వెంటనే విడుదల చేసి కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల పట్ల తమ చిత్తశుద్దిని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దళిత బంధు నిధులను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం ఆమనగల్లు పట్టణంలో నిరసన కార్య క్రమం నిర్వహించారు. అనంతరం దళితులతో కలిసి ఆయన మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత వ్యతిరేక ధోరణిని సరికాదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వస్పుల సాయిలు, గుత్తి బాలస్వామి, సురమళ్ళ సుభాష్, వడ్డెమోని శివకుమార్, లండం యాదయ్య, వస్పుల రంజిత్, కాలె విక్రమ్, దేవందర్, మహేశ్, గణేశ్‌నాయక్, ధార యాదయ్య, బీంజీనాయక్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు